

కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే



కోల్‌కతా ఘటన హేయమైన చర్య. జిల్లా ఆస్పత్రుల్లో భద్రతతో పాటు మండలాల్లో ఉండే ఆస్పత్రుల్లో కూడా రక్షణ చర్యలు తీసుకురావాలి. రాత్రి వేళ వైద్యులు, ఇతర సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. చికిత్స అవసరం లేనివారు, మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఆలోచనా శక్తి కోల్పోయి ఆస్పత్రిలో చొరబడుతుంటారు. కోల్‌కతా వంటి దారుణ సంఘటనలు జరగకుండా ఆస్పత్రి వ్యవస్థలో మార్పులు రావాలి. **-విజయ, నర్సింగ్ సూపరింటెండెంట్ ,జిల్లా ఆస్పత్రి,మదనపల్లె**

భద్రత ముఖ్యం



కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టర్ హత్య అత్యంత దారుణం. ఈ హత్యను తప్పుదారి పట్టించాలని చూశారు. కానీ ఏదో రకంగా వైద్యురాలి ఘోష బయటపడింది. ఇప్పటికి కూడా దీనిని జీర్ణించుకోలేకపోతున్నాం. మహిళా వైద్యులు సున్నిత మనస్కులు. కచ్చితంగా వారికి భద్రత అనేది తప్పనిసరిగా ఉండాలి. ఏ అవసరానికి కూడా బయటకు వెళ్లకుండా ఆస్పత్రి ఆవరణంలోనే సుదుపాయాలు,వసతులు కల్పించాలి.

-జయమ్మ, నర్సు, జిల్లా ఆస్పత్రి,మదనపల్లె

కొత్త చట్టాలు తేవాలి



కోల్‌కొతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణంతో డాక్టర్లలో ఆందోళన నెలకొంది. వైద్యం అందించే డాక్టర్‌కు ఈ పరిస్థితులు ఎదురు కావడం చాలా బాధాకరం. వైద్యుల రక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఇండియాలో ఉన్న ప్రతి కాలేజీలోనూ రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపపట్టాలి. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది పని చేసే చోట ప్రత్యేక భద్రత కల్పించాలి.

-డాక్టర్ సయ్యద్ షకూర్, జనరల్ సర్జన్, మదనపల్లె

ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి



ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. నిందితులను ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది రాత్రిపూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి.

- వి.ధనలక్ష్మి, నర్సు, టి.చాకిబండ పీహెచ్‌సీ, చిన్నమండెం

క్లుప్తంగా

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మద్దయ్యగారిపల్లిలో ఈ నెల 31న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

31న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

పెద్దమండ్యం : ఎన్టీఆర్ భరోసా ద్వారా ప్రభుత్వం అందించే సెప్టెంబర్ నెల పింఛన్ 31న శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. సెప్టెంబరు 1న ఆదివారం సెలవు దినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. 31న అందుబాటులో లేని పింఛను దారులకు 2వ తేదీన పింఛను సొమ్ము అందిస్తామని తెలిపారు.

మదనపల్లె అభివృద్ధికి సహకరించండి

మదనపల్లె : మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వినతి చేశారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రూపొందించిన నివేదికలను అందజేశారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

మదనపల్లె సిటీ : మదనపల్లె విద్యాశాఖ డివిజన్ పరిధిలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్‌కు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రాజగోపాల్, ఎస్టీయూ నాయకులు మధుసూదన్, ఆర్‌వి రమణ, యూటీఎఫ్ నాయకుడు పురం రమణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు చేయాలి

వాల్మీకిపురం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించి, డ్రగ్స్ స్టోర్, డెలివరీ గది, తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవిద్య, జులేఖ బేగం, వైద్య సిబ్బంది కిరణ్ బాబు, సుధాకర్, భానుబీ, సురేష్, కరుణ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. నెల 25 రోజులకు సంబంధించి రూ.6,01,379 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో గుర్తింపు

కలకడ : గ్రామీణ స్థాయినుంచి క్రీడలలో రాణించడం ద్వారా దేశ, ప్రపంచస్థాయి వరకు గుర్తింపు వుటుందని కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రాయుడు అన్నారు. గురువారం స్పోర్ట్స్‌డే సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన పిరమిడ్ ప్రదర్శన ఆకట్టుకుంది.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తాం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తామని ఈఓ వై. గురుమోహన్ అన్నారు. గురువారం కొత్తపల్లెచెరువు సమ్మర్‌స్టోరేజ్ సంపును పరిశీలించారు. పట్టణంలో 78 స్కీము బోర్లు ఉన్నాయని, వీటి ద్వారా నాలుగు రోజులకోసారి తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పీలేరు రూరల్ : మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం మండలంలోని ముడుపులవేముల ఆర్‌ఎస్‌కే పరిధిలోని బోడినాయునిదొడ్డిలో పొలంబడి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఏడీఏ వై.వి. రమణరావు, కలికిరి కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్, ఏఓ రమాదేవి, ఏఈఓలు ఇంద్ర, నజీర్ పాల్గొన్నారు.

అవగాహన లోపమే వ్యాధులకు మూలం

పీలేరు : అవగాహన లోపమే వ్యాధులకు మూలమని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మోడల్ కాలనీలో పారా మెడికల్ బృందంతో కలసి 'అవగాహన లోపమే - వ్యాధులకు మూలం' అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ సౌజన్య, లావణ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

దేశభాషలందు తెలుగు లెస్స

తెలుగు భాషలోని తియ్యదనం మరేభాషలోనూ లేదని అందుకే శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అని కొనియాదారని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో గురువారం గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు వక్తలు తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



రామసముద్రంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు కొనియాడారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : గుర్రంకొండలోని తెలుగు జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఎంఈఓ సుబ్రమణ్యం , పీడీ రమేష్‌బాబు మాట్లాడారు. అనంతరం హైస్కూల్ గ్రౌండ్‌లో తెలుగు అక్షరమాలలో విద్యార్థులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రమణ్యం, హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, ఏఎస్‌ఐ నరసింహులు ఫిజికల్ డైరెక్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు త్రినాథ్,హర్ష, జావీద్, రెడ్డిమోహన్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

గిడుగుకు అక్షర నివాళి

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడలు, జానపద గీతాలాపన, పద్యపఠన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, నాగరాజు, చంద్రశేఖర్, నాగరాజ, తారాదేవి, అనురాధ, శోభారాణి, వేదవాణి, రేణుక, ఉమాదేవి, వసుంధర, నాగరత్న, రాధిక, పర్వీన్, షంషాద్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్‌లో తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని హెడ్మాస్టర్ అంజద్‌అలీ, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుభాషలో లబ్ధప్రతిష్ఠులైన కవులు, మహనీయుల వేషధారణతో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటగోపాల్, వాణి, తనూజ, రేణుక, పీఈటీ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్, పీడీ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పాఠశాల చైర్మన్ బాలాజి పాల్గొన్నారు.

మహనీయులు ఆ ఇద్దరు

బి.కొత్తకోట : తెలుగు భాషకు గిడుగు వెంకట రామ్మూర్తి, క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ ఇద్దరు మహనీయులని ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ విద్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో వీరిని స్మరించుకుని నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు మహనీయుల చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ నారాయణస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ శీనునాయక్, శివశంకర్‌రెడ్డి, ప్రత్యూష, నూర్‌మహమ్మద్, సాయిలీల, గాయత్రి, సుధీర్ కుమార్, కేశవులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : స్థానిక మోడల్ స్కూల్‌లో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వాణిశ్రీ, ప్రిన్సిపాల్ హేమంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యావహారిక భాషకు ఆద్యుడు గిడుగు

పీలేరు : తెలుగు వ్యావహారిక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి అని ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి అన్నారు. స్థానిక ఎమ్మార్సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో కవి వేంపల్లె అబ్దుల్‌ఖాదర్ మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతిని విడనాడి తల్లిలాంటి తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నటరాజన్, సురేంద్రనాథరెడ్డి, కవి మురళీధర్‌రాజు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులు

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమృతభాష తెలుగును కాపాడుకునేందుకు మన వంతు బాధ్యత చూపాలన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : అమ్మ వంటిది తెలుగుభాష అని మండల



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

బి.కొత్తకోట : బి.కొత్తకోట కేజీబీవీ బాలికలు వినూత్న రీతిలో గిడుగు వెంకట రామ్మూర్తికి తెలుగు అక్షరాభిషేకం చేశారు. బాలికలు గిడుగు పేరుతో తెలుగు అక్షరాలుగా నేలపై కూర్చుని తెలుగు భాషాభిమానం చాటుకున్నారు. అలాగే మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం జాతీయ క్రీడా దినోత్సవం కావడంతో ఆయనకూ అక్షర క్రమంలో స్పోర్ట్స్ డే ఆంగ్ల అక్షరాలతో కూర్చుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధ్యాన్ చంద్ చిత్రపటం వద్ద నివాళి దృశ్యం



గుర్రంకొండలో ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు



గిడుగు అక్షరాలుగా కూర్చున్న బాలికలు



గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



కలకడ:గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళి



బి.కొత్తకోట: మహనీయుల చిత్రాల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాట నిలబెట్టుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత నెలలో పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. ఇదే క్రమంలో మాజీ ఎంపీకి చెందిన కారును తగులబెట్టారు. ఈ దాడిలో కారు పూర్తిగా కాలిపోయింది. అక్కడే ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి కొత్త కారు తీసిస్తానని మాజీ ఎంపీకి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మాజీ ఎంపీకి కొత్త కారు తీసిచ్చి గురువారం పీలేరులో తాళంచెవి అందజేశారు. ఎంపీ ఇచ్చిన మాట నిలబెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు నేను అండగా ఉంటానంటూ భరోసా కల్పించారని పలువురు శభాష్ మిథున్‌రెడ్డి అని ప్రశంసిస్తున్నారు.



మాజీ ఎంపీ రెడ్డెప్పకు కారుతాళం చెవి అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

సర్పంచ్ శ్యామలమ్మ సేవలు మరపురానివి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగు సర్పంచ్ దేవరింటి శ్యామలమ్మ పంచాయతీ అభివృద్ధికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మరపురానివని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. సర్పంచ్ శ్యామలమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి స్వగృహంలో గురువారం జరిగిన ఉత్తరక్రియల కార్యక్రమానికి హాజరయ్యారు. శ్యామలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుమారులు రామకృష్ణారెడ్డి(బాబు), రవిశంకర్‌రెడ్డి(చినబాబు), వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్పంచ్ శ్యామలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నేడు లక్కీడిప్ డ్రా

మదనపల్లె సిటీ : మదనపల్లె-తంబళ్లపల్లె మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి కోసం ఈనెల 30న లక్కీడిప్ డ్రా తీయనున్నట్లు ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. లక్కీడ్రాలో వచ్చిన ముగ్గురికి బహుమతులు అందజేస్తామన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు





అవార్డు అందుకుంటున్న పీడీలు నరేష్ నాగరాజు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల, మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ప్రతి ఏటా ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచే పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డుతో సత్కరిస్తారు. ఈ విద్యా సంవత్సరం మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు 211 పాయింట్లతో జిల్లాలో మొదటి స్థానం నిలిచింది. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయుడు గిరిధర్ నాయక్, పీడీలు నాగరాజు, నరేష్‌లు జేసీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అలాగే మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఐదవ స్థానంలో నిలిచింది. పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు అన్సర్, దేవకమ్మలు జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

వాల్మీకిపురం : సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండలంలోని నగిరిమడుగు పీహెచ్‌సీ వైద్యురాలు కీర్తి అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, నాగిరెడ్డి, మురళి, పావని, నౌషాద్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేసుకోవాలి

కలకడ : ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేసుకోవాలి అని అప్పుడే పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి లబ్ధి ప్రభుత్వం నుంచి పొందగలరని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. గురువారం మండలంలోని గంగాపురం పంచాయతీలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించి పంట ఎండిపోకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏహెచ్‌ఓ అనిత, ఏఈఓ శ్రావన్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, అనుమతులు లేకుండా పట్టణ, పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా వేస్తున్న లేఅవుట్లపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందులు పడవద్దన్నారు. మదనపల్లె-బెంగళూరు మార్గంలో అమూల్ డెయిరీ పక్కన వ్యవసాయ భూముల్లో కన్వర్షన్, ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీన్ని అక్రమ లేఅవుట్‌గా పేర్కొంటూ పీకేఎం-ఉడా అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తే దాన్ని తొలగించడమే కాకుండా, వంకను పూడ్చేసి చదును పనులు చేస్తున్నారన్నారు.

పక్కాగా ఫ్రీ హోల్డ్ భూముల రీవెరిఫికేషన్

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : అసైన్డ్‌భూములపై యాజమాన్య హక్కులు(ఫ్రీ హోల్డ్) పొందిన రైతుల భూముల రీ వెరిఫికేషన్ వివరాలను ప్రత్యేక ఫారంలో పూర్తి వివరాలతో నమోదు చేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని వలసపల్లె, పప్పిరెడ్డిపల్లె, చిప్పిలి, కోళ్లబైలు గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్‌కు సంబంధించి తహసీల్దార్ ఖాజాబీతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఫ్రీ హోల్డ్ అయిన భూముల రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రెడ్డెప్ప, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్‌ఓలు చంద్రమోహన్, జయరాం తదితరులు పాల్గొన్నారు.



ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ఖాజాబీ

ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలను ఆదుకోవాలి

పీలేరురూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి కె. నరసింహులు అన్నారు. గురువారం ఎంఈఓ పద్మావతికి ఆయాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయాలు సుమతి, శ్యామల, శ్రీలక్ష్మీ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మెడికల్, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా టైఫాయిడ్, మలేరియా, అతిసార, డెంగీ, చికున్‌గున్యా, ఎన్‌సెఫలైటిస్, బోదకాలు తదితర వాటర్ బోర్న్ వెక్టార్ (సూక్ష్మక్రిముల/పరాన్నజీవుల ద్వారా వ్యాప్తిచెందే) సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో బాధపడుతున్న ప్రజల ఆరోగ్య రక్షణకు వెంటనే రూ.5000 కోట్ల నిధులను విడుదల చేయాలని, రాష్ట్రంలో మెడికల్, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వీసీకే పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి జిల్లాకు రూ.100 కోట్లు కేటాయిస్తూ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు, ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాలకు, కిడ్నీ వ్యాధిగ్రస్తుల నిలయాలుగా మారిన శ్రీకాకుళం ఉద్దానం, కృష్ణ, ఎన్.టి.ఆర్ జిల్లాల ఎ.కొండూరు, తిరువూరు మెట్ట ప్రాంతాల ప్రజల ప్రాణరక్షణకు అదనంగా 2000 కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు.

గెస్ట్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో గెస్ట్ అధ్యాపకుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీ విజయ్ కుమార్ తెలిపారు. కళాశాలలో సివిక్స్, హిందీ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టులలో పీజీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు కళాశాలలో అందజేయాలన్నారు.